
# శాపం



"ఏమండీ!" గోముగా అడిగింది పార్వతి.

"ఊ!" అన్నాను దిద్దుతున్న కాంపోజిషన్ పుస్తకాలు అవతల పెట్టి. పార్వతి అలా అడిగిందంటే అర్థం ఏదో కోరుకోబోతున్నదన్న మాట - కాలెండరు యిరవై తొమ్మిదో తారీఖు చూపిస్తున్నది. నిట్టూర్చాను.

"రేపు సీతమ్మగారితో కలిసి కేసరపాలెం వెడతానండి...." నెమ్మదిగా అన్నది.

సరే యిదన్నమాట ఆవిడగారి చిరకాలపు కోరిక. నాలుగు రోజుల కొకసారి పార్వతి కేసరపాలెం వెడతానని నన్నడగడం నేను వద్దని నిర్మొహమాటంగా చెప్పటం అలవాటయి పోయింది. దానికి కారణం బహుశా మూఢ నమ్మకాలంటే నాకిష్టంలేకపోవటమే కావచ్చు.

"కేసరపాలెంలో ఆ భక్తురాల్ని చూడటానికి జనం తండోపతండాలుగా వస్తున్నారటండీ. ఆవిడ అందర్నీ చిరు నవ్వుతో పలకరిస్తుందట. సాక్షాత్తూ పార్వతీదేవిలా వుంటుందట. గాలిలో నుంచి విభూతి, కుంకుమా తీసి అందరికీ పంచిపెడుతుందట. ఆవిడ చేతిని తాకితే ఎన్ని రోగాలైనా యిట్టే నయమవుతాయట. అందరూ ఒకటే చెప్పుకోవటం ఆవిడ గురించి"- ఏక ధాటిగా చెప్పుకుపోతున్న పార్వతి వాక్ప్రవాహానికి అడ్డొస్తూ అన్నాను కొంచెం చిరాకుతో-

"అసలటువంటి విషయాలు నాతో చెప్పవద్దని ఎన్నిసార్లు చెప్పాను పార్వతీ. నాకలాటి వాటిమీద ఏ మాత్రం నమ్మకం లేదు. ఈ కాలంలో భక్తురాలేమిటి? దేవుడి అవతారమేమిటి? రోగాలు కుదర్చటమేమిటి? అంతా రబ్బిష్. అటువంటి ప్రదేశాలకు నేను రాను - నిన్నా మూఢ నమ్మకాలను వదలమని ఎన్నిసార్లు చెప్పినా వినవుగదా!" గట్టిగా కసిరాను.

పార్వతి ఏమనుకుందో ఏమో ఎదురు మాట్లాడక వంటింట్లోకి వెళ్ళిపోయింది.

తర్వాత రెండు రోజులకు మురారి రోడ్డు మీద కనిపించినప్పుడే ఆ విషయం గుర్తుకొచ్చింది. మురారినే సూటిగా అడిగాను.

"ఏరా - రిట్రెంచ్‌మెంటు వచ్చి ఉద్యోగం ఊడిందే అనుకో - వేరే ఉద్యోగ ప్రయత్నాలు చేయకుండా సన్నాసుల వెంట తిరగటమే - అదేం ఖర్మరా నీకీవయసులో".

మురారి ఒక్కసారిగా వణికిపోయాడు.

గబగబా చెంపలు వాయించుకున్నాడు - "అపచారం అపచారం" అంటూ.

"ఇంకెప్పుడూ అలాటి మాటలనకురా వాసూ! కళ్ళు పోతాయి, చెంపలేసుకో...." అన్నాడు.

"ఇంత చదువు చదివి నీకీ పాత చింతకాయ పచ్చడి నమ్మకాలు పోలేదిమిత్రా" అన్నాను వాడి భయానికి నవ్వుతూ.

"నేను సీరియస్‌గానే చెబుతున్నాను. విను, నీకు దేవుడంటే నమ్మకం లేకపోతే పోనీ - నా దగ్గర మాత్రం అలా మాట్లాడకు"

ఒక క్షణం ఆగి మళ్ళీ అన్నాడు - "కేసరపాలెం భక్తురాలి గురించి వాళ్లూ వీళ్లూ చెబితే - చూసొద్దామని వెళ్లాను. అంతే! ఆవిడకు శిష్యుడినయిపోయాను. ఆవిడ ముఖంలో కన్పించే దైవత్వం లాలిత్యం నన్ను ఏవో లోకాలకు తీసుకువెళ్లాయి. ఆవిడ సన్నిధిలో నాకు ఎంతో శాంతి, సంతోషం. అన్నిటికీ మించి ఒక విధమైన భక్తి భావం నన్ను అక్కడి నుంచి కదలనీయలేదు. వాసూ! నువ్వూ ఒకసారి ఆవిడ దర్శనం చేసుకో. నువ్వు ఎన్నాళ్ళనుంచో బాధపడుతున్న నీ ఉబ్బసం వ్యాధిని ఆమె అలా చేత్తో తాకి నయంచేస్తుంది నామాట విను-"

వస్తున్న నవ్వును ఆపుకొని, "ఓహో మరి డాక్టర్లందర్నీ హిమాలయాలకు పంపించేయలేక పోయారా!" అన్నాను-

మురారి కోపంగా చూశాడు.

"కూటి కోసం కోటి విద్యలు. వాటిల్లో యిదొకటిరా మురారీ - మనం రోజూ ఎంత మంది

దొంగ సన్యాసుల గురించి వినటం లేదూ - మూఢనమ్మకాల సుడిగుండాల్లో చిక్కుకున్న మనవాళ్ల బలహీనతే ఈ దొంగ సన్యాసుల దొంగ భక్తుల జీవనానికి ప్రాణం. ఈ దొంగ సన్యాసుల వల్లే - నిజంగా ఆస్తికులుగా వున్నవాళ్లే దేవుణ్ని అనుమానిస్తున్నారు"

మురారి ముఖం ఎర్రబడటం చూసి ఆపాను.

"నీ ఉపన్యాసం నేను వినదల్చుకోలేదు. కాని ఒకటి మాత్రం నిజం. నేను చూస్తుండగా ఆవిడ ఎవరిదగ్గరా ఒక్కపైసా కూడా తీసుకోలేదు. పైగా దక్షిణ ఇచ్చే వాళ్ళని చిరు నవ్వుతో ఆ దక్షిణ తనకు ఇచ్చే కన్నా తిండిలేక బాధపడేవాళ్ళకెవరికైనా యిస్తే ఆ దేవుడు సంతోషిస్తాడని వాదించేది. ఆవిడనా అనుమానించటం...."

ఏమో నాకు మాత్రం ఎందుకో నమ్మకం కుదరలేదు-

పది రోజుల తర్వాత మా బావమరిది హైదరాబాద్ నుంచి వచ్చాడు.

"బావగారూ - యిక్కడ రెండు మైళ్ళ దూరంలో వున్న కేసరిపల్లెలో ఒక భక్తురాలు వుందటగదా! ఆవిడ ఎంతటి కష్టాన్నయినా, రోగాన్నయినా ఇట్టే తగ్గించి వేస్తుందట. మా ఆఫీసులో ఒక క్లర్క్ వాళ్ళావిడ పక్షవాతంతో బాధపడుతుంటే ఆవిడ దర్శనం చేసుకున్నాడట. ఆవిడ తీర్థంయిచ్చి గాలిలో నుంచి తీసి కొంత వీభూతి కూడా ఇచ్చిందట. ఆ వీభూతి పెట్టగానే వాళ్ళావిడకి పక్షవాతం తగ్గిపోయిందిట. ఇప్పుడు చాల హాయిగా వున్నారు వాళ్ళు - అందుకనే నేను అంత దూరం నించీ యిక్కడకు వచ్చాను. అసలింతకీ మీ రెన్నిసార్లు వెళ్ళారేం అక్కడికి?" పార్వతిని అడిగాడు జగన్నాథం.

"ఆ! నా సంగతే చెప్పకోవాలి. ఎన్నిసార్లుఅడిగినా వద్దు - వీల్లేదు అంటారు. ఈసారి నీతోనయినా వచ్చి ఆవిడ దర్శనం చేసుకోవాలి, ఆయన ఏమన్నాసరే-" నా ముందే అనేసింది ధైర్యంగా.

నేనేం మాట్లాడలేదు.

"రేపెలాగో బావగారికి శెలవుగా ముగ్గురం కలిసి వెడదామా!" అన్నాడు జగన్నాథం.

పార్వతి నా వేపు ఆశగా చూసింది.

"నేను రాను - కావాలంటే మీరిద్దరూ వెళ్ళండి" - అన్నాను.

"ఆయన్ని మరీ మరీ బ్రతిమిలాడకు - కోపంవస్తే నన్నూ వెళ్లవద్దంటారు-" అన్నది పార్వతి ఏదో అనబోతున్న జగన్నాథాన్ని వారిస్తూ.

అతనేం మాట్లాడలేదు.

మర్నాడు పార్వతీ, జగన్నాథం ఆ వూరు వెళ్ళారు. చీకటి పడుతుండగా తిరిగి వచ్చారు.

ఇంకా పూర్తిగా యింట్లో అడుగుపెట్టకుండానే ప్రారంభించింది పార్వతి.

"నిజంగా ఆవిడ్ని చూడటానికి రెండు కళ్ళూ చాలవంటే నమ్మండి. ఆవిడని చూస్తుంటే ఒక పవిత్రమైన భావంతో ఒళ్ళు పులకరించి పోతుంది. అదో విధమైన దైవత్వం వుంది ఆవిడలో. ఎంత నాస్తికుడయినా ఆవిడను చూసి నమస్కరించక మానడు. ఆవిడ చిరునవ్వులో కోటి వెన్నెలల వెలుగులున్నాయి. మా కళ్ళ ఎదురుగానే కాళ్ళూ చేతులూ పడిపోయిన ఒక ముసలావిడ, ఈవిడ చేయి తగలగానే హాయిగా లేచి కూర్చుంది. అబ్బబ్బ, ఏం జనమండీ - ప్రతి వాళ్ళనీ చక్కగా పలకరించి కష్టసుఖాలు కనుక్కున్నది. ఆవిడ దగ్గరికి ముష్టివాళ్ళు దగ్గరనుంచీ పెద్ద పెద్ద ఆఫీసర్లు, ధనవంతులూ దేశం మొత్తం మీద ప్రతిచోటనుంచీ వస్తూనే వున్నారు" - చాలా చాల చెప్పేస్తున్నది పార్వతి, ఫుల్‌స్టాప్ కూడా లేకుండా.

ఇష్టం వున్నా లేకపోయినా యింట్రెస్టింగ్‌గానే వుంది గనుక కుతూహలంగా వింటున్నాను. అదీగాక పార్వతి బాగా వర్ణించి చెబుతుంది. రచయిత్రి అయి తెలుగు దేశాన్ని ఏలవలసిన పార్వతి, నన్ను పెళ్ళి చేసుకుని వంటింటికి అంకితమయిపోయింది మరి!

జగన్నాథం కూడా చాలా గొప్పగా చెప్పాడు ఆవిడ గురించి. ఆవిడ యిచ్చిన విభూతి కూడా చూపించాడు. వాళ్ళబ్బాయికి నెల రోజుల్లో ఎదురుచూస్తున్న ఉద్యోగం తప్పకుండా వస్తుందని కూడా చెప్పిందట - నన్ను కూడా వెళ్ళి ఆవిడ దర్శనం చేసుకోమని మరీ మరీ సలహా యిచ్చాడు.

నేనేం మాట్లాడక చప్పరించి వూరుకున్నాను.

"మీ రెప్పుడూ యింతే! ఊరికే యిక్కడ కూర్చుని చెడుగా ఊహించుకోకపోతే ఒకసారి వెళ్ళి చూసి మీరే తేల్చుకోవచ్చుగా-" పార్వతి అన్నది కొంచెం కసిగా.

నేనేం మాట్లాడలేదు. జగన్నాథం మర్నాడే వెళ్ళిపోయాడు-

పది రోజుల తర్వాత పక్కింటి సీతమ్మగారు - మా పార్వతితో ముందు గదిలోవున్న నాకు వినపడేటట్లుగా బిగ్గరగా చెబుతున్నది.

"అవును - ఆవిడ ఉబ్బసం పూర్తిగా తగ్గిపోయింది. ఎంతమంది డాక్టర్లూ తగ్గించలేక పోయిన ఆ వ్యాధి ఆవిడ యిట్టే నయం చేసింది. ఆయుర్వేదం, ఇంగ్లీషు, మందులేగాక, హోమియో మందులు కూడా వాడారు. కాని ఫలితం శూన్యం, చివరికి ఈవిడ చేత్తో తాకగానే

తగ్గిపోయింది-"

"మా ఆయన నే చెబుతుంటే వినటం లేదమ్మా - ఆయనకీ ఆ ఉబ్బసం వ్యాధి వున్నది. ఆయనా అన్ని మందులూ వాడారు. యింకా వాడుతూనే వున్నారు. అయినా తగ్గలేదు. ఈ భక్తురాలి దర్శనం చేసుకుంటే తగ్గుతుందని నా నమ్మకం. ఆయన మాత్రం వినరుగదా-" అంటున్నది పార్వతి.

"దేనికయినా నమ్మకమనేది ఉండాలి పార్వతమ్మా - అదివుంటే ఏదయినా యిట్టే నయ మయిపోతుంది-"

యింకా ఏదో వినపడుతున్నా నేను వినలేదు. ఆ విషయమే ఆలోచిస్తూ కూర్చున్నాను. యిదంతా మూఢనమ్మకమే అనుకుంటే మరి ఆ వ్యాధులు ఎలా తగ్గుతున్నట్లు? డబ్బు కోసం ఆడే నాటకం అయితే మరి అందరి దగ్గరా డబ్బు ఆవిడ ఎందుకు తీసుకోదు? నాకేం అంతు బట్టలేదు.

తరువాత ఆదివారం ప్రొద్దున్నే బయల్దేరుతూ - కేసరపాలెం వెడుతున్నానని చెప్పగానే పార్వతి తన చెవులను తానే నమ్మలేకపోయింది. కళ్ళు పెద్దవి చేసి, నోరు తెరచి, "నిజంగానే!" అన్నది ప్రపంచంలోని ఎనిమిదో అద్భుతాన్ని చూస్తున్నట్టుగా.

"నిజంగానే! సాయంత్రం కల్లా వస్తాను!" పార్వతితో ఎక్కువ మాట్లాడటానికి సిగ్గువేసింది. పార్వతిని ఆ వూరు వెళ్ళవద్దని చాలాకాలంగా విమర్శిస్తూ నా అంతట నేనే బయల్దేరుతుంటే నాకు అదోలా అనిపించింది. అందుకే ముక్తసరిగా జవాబు చెప్పి బయల్దేరాను.

బస్సులో కూర్చున్నానే కాని ఆలోచనలు మాత్రం ఎక్కడెక్కడో విహరిస్తున్నాయి. అసలు మనసన్నది ఒక విచిత్రమైనది. మానవుడు కొంచెం కష్టదశలో వున్నప్పుడు అడుగడుగునా దేవుడిని ప్రార్థిస్తూ - దేవుడి మీద భారం వేసి కష్టాలెదుర్కోటానికి సర్వసన్నద్ధుడవుతాడు. కష్టాలు తీరి, సుఖాలు మరిగిన తర్వాత కొంతమందికి క్రమంగా దేవుడిమీద భక్తి సన్నగిల్లుతుంది - ఒక సమయంలో దేవుడే గుర్తుకురాడు. సుఖంలో వున్నప్పుడు గుర్తుకురాని భగవంతుడు మళ్ళీ ఏదైనా కష్టం రాగానే మొట్ట మొదటిగా గుర్తుకు వస్తాడు. మళ్ళీ ఆ దేవుడిమీదే భారం వేసి ముందుకు అడుగువేస్తాడు. ఇదంతా ఆలోచిస్తే చాలమందికి కష్టాల్లోనే దేవుడనే వాడొకడున్నాడని గుర్తుకు వస్తుంది కాబోలు అనిపిస్తుంది. ఏది ఏమైనా అప్పటిదాకా నాస్తికుడినని రొమ్ము విరుచుకు నుంచున్న నాకు ముందు కేసరపల్లి భక్తురాలి విషయంలో కుతూహలం కలిగింది. తర్వాత అది ఆశగా మారింది. చాలమంది డాక్టర్లు నయంచేయలేకపోయిన నా ఉబ్బసం వ్యాధిని ఆవిడ

నయంచేస్తుందేమో అన్న ఆశ ఆవిడ మీద నమ్మకాన్ని కలుగచేసింది. ఆ నమ్మకం, బస్సు ఎక్కినప్పటినించీ పెరుగుతూ ఆ వూరు దగ్గరవుతున్న కొద్దీ ఆవిడ మీద ఒక భక్తి భావాన్ని పెంపొందింప చేస్తున్నది. కళ్ళెంలేని గుర్రంలా పరుగులు తీస్తున్న నా మనసులోని భావాలు - నన్నే ఆశ్చర్యపరచినయి - నాకు తెలీకుండానే మనసులో ఆవిడకు నమస్కరించాను. నన్ను నరకయాతనపెడుతున్న నా వ్యాధిని తగ్గించితే ఆవిడ ఆశ్రమానికి ఒక వంద రూపాయలు యివ్వాలని నిర్ణయించుకున్నాను. అంతేకాక దేవుళ్ళందరికీ నమస్కారాలు పెట్టుకున్నాను. చిన్న చిన్న మొక్కులు మొక్కుకున్నాను.

బస్సులో నా ముందు కూర్చున్నాయన అంటున్నాడు - "ముందు నేనూ నమ్మలేదు. ఒట్టి గాలికబుర్ల క్రింద కట్టి కొట్టి పారేశాను. కాని ఆయనే స్వయంగా చెబుతుంటే నమ్మక ఏం చేయమంటారు?"

"ఏమో నేను నమ్మను - ఏదో ...... ఆయన అలా చెప్పి వుండవచ్చు అంతే కాని ఆవిడ అలాటిది కాదు - అలాటి విషయాలు మాట్లాడటం అపచారం కూడాను" అంటున్నాడు ఆయన ప్రక్క ఆయన.

"నాతో ఆయన చెప్పింది మీతో చెబుతున్నాను. అబద్ధం చెప్పవలసిన అవసరం నాకేంలేదు - ఆవిడ దగ్గర వున్న శిష్యులలో ముఖ్యుడు ఆయన - ఆవిడ పవిత్రత భక్తి అంతా నాటకమనీ, డబ్బుకోసం వేసిన వేషమనీ చెప్పాడు".

"సరేనండీ మీరు చెప్పింది నిజం అనుకోటానికి - ఆవిడ ఎవరిదగ్గరా డబ్బు తీసుకోదు గదా!"

"అదే అక్కడి విశేషం - మీ దగ్గరా నా దగ్గరా తీసుకోదు -- మనలాటి సామాన్యుల వల్ల ఆవిడకు వచ్చిన పేరుతో - చాల మంది ధనవంతులు ఆవిడకు పాదపూజ చేస్తున్నారు. లక్షలు కురిపిస్తున్నారు - అది చాలదూ ఆవిడకి - అంతే కాదు ఆవిడ గుణం కూడా మంచిది కాదని అందరితో చెబుతున్నాడు శిష్యుడు. తనకీ ఆవిడకీ చాల సంబంధం ఉందని, తనని ఆవిడ వదలి వుండలేదనీ - చాల చెడుగా చెప్పాడు".

వింటున్నకొద్దీ నాకు మతిపోయినట్టయింది. అలాటి ఆవిడ దర్శనం కోసమా నే వెడుతున్నది? ఆవిడ అంత గుణంలేనిదా? కానీ ఇదంతా అబద్ధమనీ, ఆవిడ గొప్పదనాన్ని కించపరచటానికి చేసే ప్రచారమనీ, యిదంతా ఆవిడ పట్ల చేస్తున్న ప్రచారమనీ మనసులోనించి ఏదో కంఠం గట్టిగా అరుస్తున్నది.

ఏమయినా బయల్దేరాను కనుక ఇక వెనుదిరగ దలుచుకోలేదు.

ఆవిడ ఆశ్రమం దగ్గర జనం, నేను అనుకున్నంతగా లేరు. పార్వతీ జగన్నాథం, సీతమ్మ వర్ణించినంతగా లేరు. ఆవిడ ఆశ్రమం చిన్నదయినా, అందంగా వుంది. నా ముందు వెడుతున్న వారితోకలిసి లోపలికి అడుగుపెట్టాను.

ఆవిడ చిరునవ్వుతో ఆహ్వానించింది.

ఒక క్షణం ఆవిడ్ని దీక్షగా చూశాను. ఆవిడ ముఖంలో ఏదో తేజస్సు కనపడింది. ఒక విధమైన దివ్యభావం మెరుపులా మెరిసింది. మైమరుపుతో మనసారా నమస్కరించాను.

నన్ను దగ్గరకు పిలిచింది. నా తలను ఆప్యాయంగా నిమిరింది. చిరునవ్వు నవ్వి, గాలిలో ఒక చిటిక వేసింది. ఆశ్చర్యం! ఆవిడ చేతిలోకి చిటికెడు విభూతి వచ్చింది. భక్తి పూర్వకంగా అందుకున్నాను.

"వెళ్ళు నాయనా - నిశ్చింతగా వుండు" అన్నాదావిడ. ఆవిడ చిరునవ్వు లాలిస్తున్నట్టుగా వుంది.

"నేను ఉబ్బసం వ్యాధితో బాధపడుతున్నాను.... నాకు...."

మాట్లాడబోతున్న నన్ను వారించింది -

"నా మీద నమ్మకం  వుంచుకో చాలు. త్వరలోనే నయమవుతుంది".

ఆవిడకు మళ్లీ మళ్లీ నమస్కరించి బయటకు నడిచాను. మనసంతా ఉల్లాసంగా వుంది. ఏదో భారం దించినట్లు ఫీలయ్యాను. నమ్మరేమోగాని అప్పుడే పూర్తిగా ఆరోగ్యవంతుడినయి పోయాననిపించింది.

కొంచెం దూరం నడిచిన తర్వాత మురారి గుర్తుకు వచ్చాడు. మురారి యిల్లు కనుక్కొని లోపలకు అడుగు పెట్టాను.

ఇంట్లో ఎక్కడా కనపడలేదు. కాని ఒక మూల మంచం మీద మురారి ఒళ్లు తెలీకుండా పడివున్నాడు.

"మురారీ... మురారీ" గట్టిగా తట్టి పిలిచాను.

"ఎవరూ" నీరసంగా కళ్లు తెరిచి చూసి, "నువ్వా వాసూ! యిలా వచ్చావేమిటి?" ఆశ్చర్యపోయాడు.

"అదిసరే నువ్విలా అయిపోయావేమిటి?" అడిగాను.

మురారి నిట్టూర్చాడు. ఒక్క క్షణం నా కేసి చూశాడు. కళ్ళల్లో నీళ్ళు తిరిగాయి.

"అదేమిటి మురారీ! ఆ కన్నీళ్లేమిటి?"

హఠాత్తుగా భోరుమని ఏడ్చాడు మురారి నన్ను కావలించుకుని.

"ఛా - ఆడపిల్లలా ఏడుస్తావేం అసలేం జరిగిందో చెప్పు".

"ఏం చెప్పను, నేను చేసిన పాడు పనికి" ఆగాడు మురారి.

వింతగా చూశాను అతని వైపు.

"అవును వాసూ! నాకు ఆ భక్తురాలంటే కొన్ని విషయాల్లో నచ్చలేదు. నాకు జరిగిన కొన్ని అవమానాలవల్లా - ఆవిడకు వద్దన్నా వస్తున్న సంపదను చూసీ, ఆవిడంటే ఒక విధమైన ఏహ్యాభావం కలిగింది. ఆవిడ పరపతి తగ్గించాలనే ఉద్దేశ్యంతో ఆవిడ మీద అపనింద వేశాను. అదేవిధంగా ప్రచారం సాగించాను. ఆఖరికి ఆవిడకూ, నాకూ చెడు సంబంధం వున్నదనే ప్రచారం కూడా చేశాను. నేను కోరినట్టుగానే ఆవిడ దర్శనానికి వచ్చే జనం తగ్గిపోతున్నారు. ఆవిడ సంపాదన తగ్గిపోతున్నది. కానీ నా మనసులో ఆవిడ పట్ల అపచారం చేస్తున్నాననే బాధేకాకుండా, నేను చేస్తున్న పాపానికి ఆవిడ ఏం శపిస్తుందో అన్న భయం నన్ను అనుక్షణం పీడిస్తున్నది. నిద్ర పట్టడం లేదు. మనశ్శాంతి లేదు. రోజురోజుకీ కృశించి పోతున్నాను".

మురారి చెప్పినది వింటుంటే అతని మీద విపరీతంగా అసహ్యం వేసింది. ఎంత ఘోరానికి ఒడి గట్టాడు. ఎంత అపచారం చేస్తున్నాడు. ఇంతకన్నా అసహ్యంగా ఎవరయినా ప్రవర్తించగలరా? అతన్ని చూస్తున్న కొద్దీ ఒంటి మీద తేళ్ళు జెర్రులూ పాకుతున్నట్లు అనిపించింది. అక్కడ ఒక్క క్షణం కూడా నిలబడలేక అతను పిలుస్తున్నా వినకుండా బయటకు వచ్చేశాను.

రెండు మూడు రోజులు గడిచాయి. నాలో భక్తి భావం పెరిగిపోవటం చూసి పార్వతి బాగా సంతోషించింది. భక్తురాలి ఫొటోను పూజ మందిరంలో వుంచి రోజూ పూజ చేస్తున్నాను ఉబ్బసం కూడా కొంచెం తగ్గినట్టు అనిపించింది.

ఆ రోజు ప్రొద్దున్న తీరిగ్గా కూర్చుని ఆన్సర్ పేపర్లు దిద్దుతున్నాను. నూతి దగ్గర మంచి నీళ్ల బిందె చంకన బెట్టుకుని యింట్లోకి వస్తున్న పార్వతి నా కళ్లకి మధురా నగరిలో రాధలా కనిపించింది.

పార్వతి చటుక్కున నీళ్ల బిందె క్రింద పెట్టి రహస్యం చెబుతున్నట్టుగా అన్నది - "ఇది విన్నారా మీ మురారి నిన్న మధ్యాహ్నం చచ్చిపోయాడుట సీతమ్మ చెప్పింది" అటూ విసవిసా లోపలికి వెళ్ళింది పార్వతి చంకలో బిందెతో.

నేను ఆశ్చర్యపోయినా, కొంచెం బాధపడ్డాను. ఎంత అసహ్యించుకునే పని చేసినా, మురారి నా స్నేహితుడు.

"ఆ భక్తురాలి మీద అపనింద వేసి పాపం చేసుకున్నాడు. అపచారం చేశాడు. మరి ఆవిడ శాపానికి బలి అవక బ్రతికి బట్టకడతాడని ఎలా అనుకుంటాం?"

అవును - మురారి దేవుడితో సమానమైన ఆ భక్తురాలి మీద నిందలు వేశాడు. అపచారం చేశాడు. ఆవిడ శాపానికి బలి అయ్యాడు.

ఈ విషయమే ఆలోచిస్తున్న నన్ను పేపర్ కుర్రాడు కేక మేల్కొలిపింది. పేపరు అందుకున్నాను. అందులో ఒక మూలగా ప్రచురించిన వార్త నన్నాకర్షించింది.

"కేసరపాలెం భక్తురాలి అరెస్టు - దొంగ బంగారం, మారిజోనా వ్యాపారం చేస్తున్న సందర్భంలో కేసరపాలెంలో ఒక ముఠాను నిన్న రాత్రి అరెస్టు చేశారు... దీనికంతటికీ నాంది అక్కడ భక్తురాలిగా నటిస్తూ" - ఇక చదవలేకపోయాను.

ఈ వార్త నిజమేనా - లేక ఇదీ ఆవిడ మీద వేసిన అభాండమా? అర్థం కాలేదు. ఏమయినా - ఆ సమయంలో నా ఉబ్బసం వ్యాధి పెరుగుతున్నట్టుగా అనిపించింది. ★

*(ప్రజామత వారపత్రిక: జూలై 2, 1972)*